సాక్షి
కుమురం భీం

శనివారం । 12 । అక్టోబర్ । 2024

ఊరంతా
పూలవనం

పూల పండుగగా పిలిచే బతుకమ్మ సంబురాలు అంబరాన్నంటాయి. తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మలను శుక్రవారం సమీపంలోని వాగులు, చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేశారు.

- వివరాలు 7లో▸





ప్రత్యేక టాప్ నంబర్లతో ఆటోలు

భరోసా కల్పించేలా..!

- జైనూర్ ఘటనతో పోలీసుశాఖ ప్రత్యేక కార్యాచరణ
- జిల్లాలోని ఆటోలకు ప్రత్యేక నంబర్లు కేటాయింపు
- పోలీసుల వద్ద ఆటోవాలాల డేటాబేస్
- మహిళల రక్షణకే అంటున్న అధికారులు

సాక్షి, ఆసిఫాబాద్: మహిళల రక్షణపై పోలీసుశాఖ మరో ముందడుగు వేసింది. జిల్లాలోని మొత్తం ఆటోల వివరాలు సేకరించి ప్రత్యేక డేటాబేస్ రూపొందించింది. జైనూర్‌లో ఒంటరిగా నడుచుకుంటూ వెళ్తున్న ఓ మహిళపై ఆటోడ్రైవర్ దాడిచేసి తీవ్రంగా గాయపర్చిన ఘటన జిల్లావ్యాప్తంగా ప్రకంపనలు సృష్టించిన విషయం తెలిసిందే. ఈ ఘటన తర్వాత మహిళలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఈ క్రమంలో మహిళలకు ధైర్యం, భరోసా కల్పించేలా పోలీసు విభాగం సన్నద్ధమైంది. మహిళలు, యువతులపై దాడులు.. ఇతర ఘటనలను అరికట్టేందుకు ఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. ఆటోలకు గుర్తింపు నంబర్లు కేటాయించే దిశగా చర్యలు చేపట్టారు.

మహిళలకు భరోసా..

జైనూర్ సంఘటనతో జిల్లావ్యాప్తంగా మహిళలు ఒంటరిగా ఆటోల్లో వెళ్లేందుకు సంశయిస్తున్నారు. ఆటో డ్రైవర్ బాగా తెలిసిన వ్యక్తి అయినా సరే ప్రయాణానికి ససేమిరా అంటున్నారు. తోడుగా ఎవరైనా ఉంటే తప్పా జిల్లాలో ధైర్యంగా ఆటో ఎక్కే పరిస్థితి కనిపించడం లేదని చర్చించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో పోలీసు బాస్ మహిళలకు భరోసా కల్పించేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేయనున్నారు. ఆటో డ్రైవర్లపై సీరియస్‌గా ఫోకస్ పెట్టారు. లైసెన్స్ నుంచి వాహనం రిజిస్ట్రేషన్ వరకూ అన్నీ పక్కాగా ఉండాలంటూ హెచ్చరికలు జారీ చేశారు. నిబంధనలు అతిక్రమించినా.. ప్రయాణికులతో ఇష్టారీతిన వ్యవహరించినా చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు.

మండలాల వారీగా ఆటోలు

మండలం	ఆటోల సంఖ్య
ఆసిఫాబాద్	789
కాగజ్‌నగర్	952
జైనూర్	492
కెరమెరి	413
సిర్పూర్(యూ)	270
తిర్యాణి	273
వాంకిడి	311
రెబ్బెన	426
సిర్పూర్(టి)	241
కౌటాల	288
బెజ్జూర్	235
దహెగాం	236
లింగాపూర్	48
పెంచికల్‌పేట్	57
చింతలమానెపల్లి	100
మొత్తం	5,135

ప్రత్యేక టాప్ నంబర్లు..

జిల్లాలో పోలీసు అధికారులు ప్రతీ ఆటో డేటాబేస్ సేకరిస్తున్నారు. వాహనానికి సంబంధించిన యజమాని, డ్రైవర్ వివరాలు.. ఇన్సూరెన్స్ తదితర డాక్యుమెంట్లు వివరాలను సేకరించి ఆయా ఆటోలకు పోలీసు స్టేషన్ల వారీగా ప్రత్యేక టాప్ నంబర్లు కేటాయిస్తున్నారు. ఈ ప్రక్రియ జిల్లావ్యాప్తంగా ఉన్న అన్ని పోలీసుస్టేషన్ల పరిధిలో జరుగుతోంది. ఆటోలను ఎవరైనా దొంగలించినా.. వాహనంతో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, మహిళలతో అసభ్యకరంగా ప్రవర్తించినా.. ఈ టాప్ నంబర్ల ఆధారంగా నిందితులను తక్షణమే గుర్తించవచ్చని ఎస్పీ శ్రీనివాసరావు వెల్లడించారు. రవాణా శాఖ అధికారిక లెక్కల ప్రకారం 15 మండలాల పరిధిలో 5,135 ప్యాసింజర్ ఆటోలు ఉన్నాయి. ఇందులో జిల్లా కేంద్రం, ఆసిఫాబాద్ పట్టణంలో 789 ఆటోలు ఉండగా.. ఇక పారిశ్రామిక ప్రాంతమైన కాగజ్‌నగర్‌లో అత్యధికంగా 952 ఆటోలు ఉన్నాయి. చిన్న మండలాలైన లింగాపూర్, పెంచికల్‌పేట్‌లో అతి తక్కువగా ఆటోలు ఉన్నాయి. అయితే ఇందులో కొన్ని ఆటోలు మూలనపడ్డవి ఉండగా.. వాటి యజమానులు ఆయా వాహనాలను రవాణా శాఖ కార్యాలయంలో స్క్రాప్‌గా నమోదు చేయించడం లేదు. అధికారుల అంచనాల ప్రకారం జిల్లాలో 70 శాతం వరకు ఆటోలు వినియోగంలో ఉన్నాయని తెలుస్తోంది.

విజయోత్సవానికి సిద్ధం

- నేడు జిల్లావ్యాప్తంగా దసరా వేడుకలు
- ప్రత్యేక పూజలకు ముస్తాబైన ఆలయాలు
- కాగజ్‌నగర్‌లోని త్రిశూల్‌పహాడ్‌పై రావణ దహనానికి ఏర్పాట్లు
- భారీగా తరలిరానున్న భక్తులు



జిల్లా కేంద్రంలో ముస్తాబైన కేస్లాపూర్ హనుమాన్ ఆలయం

ఆసిఫాబాద్: విజయానికి ప్రతీకగా దసరా ఉత్సవాలు జరుపుకొంటారు. జిల్లా ప్రజలు శనివారం విజయదశమి వేడుకలు వైభవోపేతంగా నిర్వహించనున్నారు. పట్టణాలతోపాటు పల్లెల్లో ఏర్పాట్లు ముమ్మరం చేశారు. జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ హనుమాన్ ఆలయం వద్ద శనివారం దసరా ఉత్సవాల కోసం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ఆలయ ముఖద్వారం, అభయాంజనేయ స్వామి భారీ విగ్రహం, ప్రధాన ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. సాయంత్రం 5 గంటలకు అభయాంజనేయస్వామి భారీ విగ్రహం నుంచి ప్రధాన ఆలయం వరకు పూర్ణకలశంతో శోభాయాత్ర నిర్వహించనున్నారు. సాయంత్రం 5.15 గంటలకు ఆలయ ప్రాంగణంలో భక్తులు పాల్గొని శమీ వృక్ష పూజను సంప్రదాయబద్ధంగా నిర్వహించనున్నారు. అనంతరం భక్తులను అలరించేందుకు భక్తి, సంగీత వినోద కార్యక్రమాలు ఉంటాయని కమిటీ ప్రకటించింది. లక్కీ డ్రా ఎంపిక అనంతరం ప్రముఖుల ఆధ్వర్యంలో విజయదశమి ప్రాముఖ్యత వివరిస్తూ శుభాకాంక్షలు తెలపనున్నారు. ఆలయ ప్రాంగణంలో భూమిని చదును చేసి లైటింగ్, సౌండ్ సిస్టం, పార్కింగ్ ఏర్పాట్లు చేస్తున్నారు. విజయ దశమి పుణ్యతిథి పురస్కరించుకొని శనివారం ఉదయం పట్టణంలో సాయి ఉత్సవ విగ్రహంతో నగర సంకీర్తన, జోలి భిక్ష నిర్వహించనున్నారు. ఆలయంలో ఉదయం కాకడ హారతి, మంగళస్నానం, పంచామృత అభిషేకం, ఉదయం సాయినాథుడికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేపడతామని అర్చకుడు మధుకరశర్మ తెలిపారు. పండుగ నేపథ్యంలో చదువులు, ఉద్యోగ, వ్యాపారాల కోసం దూరప్రాంతాల్లో ఉంటున్న జిల్లావాసులు ఇప్పటికే స్వస్థలాలకు చేరుకున్నారు. అలాగే ఆసిఫాబాద్, కాగజ్‌నగర్‌లో పనిచేస్తున్న ఇతర ప్రాంతాలకు చెందిన వారు సైతం జిల్లాను వీడారు. దీంతో రెండు రోజులుగా ఆర్టీసీ బస్సులు రద్దీగా మారాయి. కాగా.. దసరా పండుగను పురస్కరించుకుని ఆలయాల్లో వాహనాలకు ప్రత్యేక పూజలు చేయనున్నారు.

చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తు
– ఎస్పీ డీవీ శ్రీనివాసరావు



ఆసిఫాబాద్‌అర్బన్: చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా విజయదశమి జరుపుకొంటామని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిఒక్కరూ సన్మార్గాన్ని ఎంచుకుని సమాజ బాగుకోసం పాటుపడాలన్నారు. పోలీసు అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలన్నారు. జిల్లా పోలీసుశాఖ శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణలో ముందుండాలని ఆకాంక్షించారు. సమాజం నుంచి చెడును పారదోలేందుకు ప్రజలు సహకరించాలని కోరారు.



త్రిశూల్‌పహాడ్‌పై రావణుడి ప్రతిమ



త్రిశూల్‌పహాడ్‌పై దుర్గామాత

త్రిశూల్‌పహాడ్‌పై ఉత్సవాలు

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని త్రిశూల్‌పహాడ్‌పై దసరా ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. విజయదశమి నేపథ్యంలో రావణ ప్రతిమ దహనం చేపట్టనున్నారు. ఏటా నిర్వహించే ఈ కార్యక్రమాన్ని వీక్షించేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివస్తుంటారు. రావణ దహనంతోపాటు జమ్మిపూజ నిర్వహిస్తారు. ఈ సారి వేడుకల్లో ఎమ్మెల్యే హరీశ్‌బాబు, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, డీఎస్పీ రామానుజంతోపాటు పలువురు అధికారులు, ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. భక్తుల సౌకర్యార్థం విద్యుత్ దీపాలంకరణ, పార్కింగ్, సౌండ్‌సిస్టం ఏర్పాటు చేశారు. శరన్నవరాత్రుల సందర్భంగా త్రిశూల్‌పహాడ్‌పై గల సత్యనారాయణస్వామి దేవాలయం ఆవరణలో దుర్గామాతను ప్రతిష్ఠించి పూజలు చేస్తున్నారు. పండుగ రోజు అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకోనున్నారు.

న్యూస్‌రీల్

రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబర్చాలి



ప్రశంసాపత్రాలు అందిస్తున్న అదనపు ఎస్పీ ప్రభాకర్‌రావు

ఆసిఫాబాద్‌అర్బన్: జోనల్‌స్థాయి పోలీసు డ్యూటీ మీట్‌లో రాణించిన అధికారులు, సిబ్బంది రాష్ట్రస్థాయిలోనూ ఉత్తమ ప్రతిభ కనబర్చాలని జిల్లా అదనపు ఎస్పీ ప్రభాకర్‌రావు అన్నారు. జోనల్‌లెవల్ డ్యూటీ మీట్‌లో ప్రతిభ చూపిన అధికారులు, సిబ్బందిని శుక్రవారం జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయంలో అభినందించి ప్రశంసాపత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 14 నుంచి 18 వరకు టీజీపీఏలో నిర్వహించే రాష్ట్రస్థాయిలో రాణించి జిల్లాకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. జిల్లా నుంచి ప్రశాంత్(ఎస్సై, వాంకిడి), రోహిత్ (ఏఆర్ హెడ్ క్వార్టర్స్, ఆసిఫాబాద్), వెంకటస్వామి(డీఆర్‌పీ హెడ్‌క్వార్టర్స్, ఆసిఫాబాద్) రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని తెలిపారు.

ఫొటోగ్రఫీ, షార్ట్‌ఫిలిం పోటీలకు ఆహ్వానం

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో ఈ నెల 21న ఫ్లాగ్‌డే సందర్భంగా పోలీస్ అంశంపై ఫొటోగ్రఫీ, షార్ట్ ఫిలిం తీసేందుకు ఆసక్తి గల వారు ముందుకు రావాలని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసుల త్యాగాలు, విధుల్లో చూపుతున్న తెగువ, మూఢనమ్మకాలు, ఇతర సామాజిక రుగ్మతలు, అత్యవసర పరిస్థితుల్లో పోలీసుల స్పందన, ప్రకృతి వైపరీత్యాల సమయంలో సేవ, సైబర్ నేరాల నివారణ, ఈవ్‌టీజింగ్, షీటీం, మత్తు పదార్థాల వాడకంతో కలిగే అనర్థాలపై తీసిన మూడు ఫొటోలు, మూడు నిమిషాల షార్ట్ ఫిలిం తీసి ఈ నెల 24న సాయంత్రం వరకు సమీపంలోని పోలీసు స్టేషన్, డీఎస్పీ కార్యాలయంలో అందించాలని సూచించారు. జిల్లాస్థాయికి ఎంపికైన మూడు షార్ట్‌ఫిలింలను డీజీపీ కార్యాలయానికి పంపిస్తామని తెలిపారు. పోలీసు అమరుల దినోత్సవం సందర్భంగా వ్యాసరచన, రక్తదాన శిబిరాలు, సైకిల్‌ర్యాలీలు నిర్వహిస్తామని తెలిపారు.

ఖాతాలు తెరవాలి

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలోని వివిధ విద్యాసంస్థల్లో చదువుతున్న ఎస్సీ విద్యార్థులు ఆధార్ అనుసంధాన బ్యాంకు ఖాతాలు, పోస్టాఫీసు ఖాతాలు తెరవాలని జిల్లా ఎస్సీ సంక్షేమశాఖ అధికారి సజీవన్ ఒక ప్రకటనలో తెలిపారు. పోస్టల్ విభాగం కొత్తగా ఇండియన్ పోస్ట్ పేమెంట్ బ్యాంకు పేరుతో బ్యాంకింగ్ సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకువచ్చిందని తెలిపారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

చివరికి నీరేది..?



త్రీఫేజ్ విద్యుత్ సరఫరా చేయడం లేదని కౌటాల మండలం గుడ్లబోరి, తాటిపల్లి, తలోడి, గుండాయిపేట గ్రామాల రైతులు మండల కేంద్రంలో ఈ నెల 8న ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు దృష్టికి తీసుకెళ్లారు. వర్షాలు లేక వరి, మిర్చి పంటలు ఎండిపోతున్నాయని, పత్తి మొక్కల్లో ఎదుగుదల తగ్గిందని వాపోయారు. పగలు అసలు విద్యుత్ సరఫరా ఉండటం లేదని, రోజుకు రెండు మూడు గంటలే కరెంట్ ఉంటుందని తెలిపారు. లోఓల్టేజీతో మోటార్లు కాలిపోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇలా పలు గ్రామాల్లో విద్యుత్ కోతలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.



తలోడి శివారులో వరి పొలం దుస్థితి..

- పొట్టదశలో నెర్రలు బారుతున్న పొలాలు
- నీటి తడులు లేక విపరీతంగా కలుపు సమస్య
- వర్షాలపై ఆధారపడిన రైతులకు తప్పని పాట్లు
- విద్యుత్ కోతలతో ఇబ్బందులు

కౌటాల(సిర్పూర్): నైరుతి రుతుపవనాలు నిష్క్రమించాయి.. వర్షాకాలం సీజన్ ముగిసింది. కొద్దిరోజులుగా వాతావరణం పొడిగా మారింది. జిల్లాలో 15 రోజులుగా వర్షాలు లేక పొలాలు ఎండుతున్నాయి. వరి పైరు పాలుపోసుకునే దశలో పంటకు నీరు కరువైంది. అన్నదాతలు బోర్లు, వ్యవసాయ బావులు, వాగుల నుంచి పైపులైన్లు వేసుకుని పొలాలకు నీరందిస్తున్నారు. మరోవైపు విద్యుత్ కోతలు రైతులను ఇబ్బందుల పాలుచేస్తున్నాయి. వర్షాల కోసం గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ప్రత్యేక పూజలు చేస్తూ కప్పతల్లి ఆటలు ఆడుతున్నారు. కరెంట్ కోతలను నిరసిస్తూ ఇటీవల కౌటాల విద్యుత్ కార్యాలయం ఎదుట ముత్తంపేట రైతులు ఆందోళన చేపట్టారు.

నిష్క్రమించిన నైరుతి

రాష్ట్రంలో వర్షాకాలం సీజన్ జూన్‌లో ప్రారంభమై సెప్టెంబర్‌తో ముగుస్తుంది. ఆ తర్వాత నైరుతి రుతుపవనాలు నిష్క్రమిస్తాయి. మళ్లీ తిరోగమన రుతుపవనాలతో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉంటుంది. జిల్లాలో ఈ వానాకాలం సీజన్‌లో 1025.8 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా 1174.9 మి.మీ. నమోదైంది. సాధారణ వర్షపాతమే నమోదైనా రెండు వారాలుగా చినుకు జాడ లేదు. రెండు రోజులుగా మళ్లీ ఆకాశం మేఘావృతమై ఉంటున్నా వర్షం పడటం లేదు. వరి పొలాలు, మిరప చేలు ఎండిపోతున్నాయి. పత్తి పంటలో దిగుబడి తగ్గే అవకాశం ఉంటుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాన లేక వరి పొలాల్లో కలుపు సమస్య పెరిగింది. కలుపు తీసేందుకు ఎకరాకు కనీసం 20 మంది కూలీలకు రూ.7వేల ఖర్చు అవుతుంది. నీటి సౌకర్యం లేకపోతే మరింత వెచ్చించాల్సి వస్తోంది. రానున్న మూడు రోజుల్లో మోస్తారు వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు ప్రకటించడంతో రైతులు ఆశతో ఉన్నారు.

‘పొట్ట’ మీద ప్రభావం..

వరి నారుమడి వేసిన మొదలు రైతులను కష్టాలు వెంటాడుతున్నాయి. జిల్లావ్యాప్తంగా ఈ ఏడాది 62,209 ఎకరాల్లో వరి సాగు చేశారు. సాగునీటి వనరులు అంతంతే ఉండటంతో అధికంగా వర్షాధారంగానే పంటలు పండిస్తారు. ప్రస్తుతం వరి పైరు పొట్టకొచ్చే దశలో వర్షాలు లేకపోవడంతో పొలాలు ఎండిపోతున్నాయి. బోర్లు, బావులు, వాగులపై ఆధారపడిన వారు సైతం పంట రక్షించుకోవడం కష్టంగా మారింది. విద్యుత్ కోతలు, లోవోల్టేజీతో మోటార్లు పనిచేయడం లేదు. ఆయిల్ ఇంజిన్, జనరేటర్ల సాయంతో నీటి తడులిచ్చేందుకు తంటాలు పడుతున్నారు. దీంతో రైతులకు ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి. ఆయిల్ ఇంజిన్ అద్దెకు గంటకు రూ.300, జనరేటర్ వాడితే గంటకు రూ.600 చెల్లించాల్సి వస్తోంది. అలాగే డీజిల్‌కు అదనంగా వెచ్చించాల్సిందే. ఇక కౌలుకు పొలాలు తీసుకుని సాగుచేస్తున్న వారి ఇబ్బందులు రెట్టింపయ్యాయి. చేసిన అప్పులు తీరే మార్గం లేక ఆందోళనకు గురవుతున్నారు.

నీటి కోసం తంటాలు



మూడెకరాల్లో వరి సాగు చేస్తున్నా. ప్రస్తుతం పంట పొట్ట దశలో ఉంది. వానలు లేకపోవడంతో పంట దిగుబడిపై ప్రభావం పడుతుంది. 15 రోజులుగా పొలానికి నీటి తడులు పెట్టేందుకు తంటాలు పడుతున్నాం. విద్యుత్ కోతల కారణంగా ఇబ్బందవుతోంది.

– సత్తయ్య, రైతు, తలోడి, మం.కౌటాల

పొట్ట దశలో వరి



రెండెకరాల్లో వరి సాగు చేస్తున్నా. వర్షాలు లేక పంట పొట్ట దశలో ఉన్న వరి పొలం నెర్రబారింది. ఏం చేయాలో తోచడం లేదు. విద్యుత్ మోటార్‌తోనే నీటి తడులు అందిస్తున్నా. పెట్టుబడి పెరుగుతోంది. వరి పంటకు ప్రభుత్వం మద్దతు ధర పెంచాలి.

– రావుజీ, యాపలగూడ, మం.కౌటాల

సింగరేణిని వృద్ధి పథంలో నడిపించాలి

- బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వినోద్

రెబ్బెన(ఆసిఫాబాద్): లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తున్న సింగరేణి సంస్థను మరింత వృద్ధి పథంలో నడిపించేందుకు ఉద్యోగులంతా కృషి చేయాలని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. ఉజ్వల సింగరేణి- ఉద్యోగుల పాత్ర కార్యక్రమంలో భాగంగా శుక్రవారం గోలేటి టౌన్‌షిప్‌లోని ఆఫీసర్స్ క్లబ్‌లో మల్టీ డిపార్టుమెంటల్ సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో నష్టాల్లో కొనసాగిన సింగరేణి సంస్థను కాపాడిన ఘనత కాకా వెంకటస్వామిదని కొనియాడారు. ఇప్పటికీ తమ కుటుంబం సింగరేణి ఉద్యోగులు, సంస్థ పురోగతి కోసం కృషి చేస్తుందన్నారు. పెర్క్స్ అలవెన్స్‌లపై ఉద్యోగులకు ఆదాయపు పన్ను లేకుండా కేంద్రంతో మాట్లాడుతానని హామీ ఇచ్చారు. బెల్లంపల్లి ఏరియాలో త్వరలో రానున్న గనుల విషయంలో తన పూర్తి సహకారం ఉంటుందని తెలిపారు. అనంతరం ఉద్యోగుల కోసం ఏర్పాటు చేసిన విందులో పాల్గొన్నారు. అంతకు ముందు మల్టీ డిపార్టుమెంటల్ కమిటీ అధికారులతో కలిసి జీఎం శ్రీనివాస్ సింగరేణి సమగ్ర ప్రగతిపై ప్రొజెక్టర్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి, ఎస్‌వోటూజీఎం రాజమల్లు, డీజీఎం ఉజ్వల్‌కుమార్ బెహారా, ఫైనాన్స్ మేనేజర్ రవికుమార్, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

గౌడ కులస్తుల సంక్షేమానికి కృషి



కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ దండే విఠల్, ఎమ్మెల్యే హరీశ్‌బాబు

కాగజ్‌నగర్‌రూరల్: గౌడ కులస్తుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్సీ దండే విఠల్ అన్నారు. పట్టణంలోని గౌడ సంఘం ఆవరణలో బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం కాటమయ్య రక్షా కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గౌడ కులస్తుల కోసం ఈ కిట్లను ప్రభుత్వం తయారు చేయించిందన్నారు. కల్లు గీత కార్మికులు తప్పకుండా ఈ కిట్లను ధరించిన తర్వాతే తాటిచెట్లు ఎక్కాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే హరీశ్‌బాబు మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాల్లో గౌడ కులస్తులు ఎదుర్కొంటున్న సమస్యలపై అసెంబ్లీలో మాట్లాడతానని తెలిపారు. వారి సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ ఈడీ సజీవన్, ఎక్సైజ్ సీఐ రవి, మోకుదెబ్బ జిల్లా అధ్యక్షుడు కోండ్ర మనోహర్ గౌడ్, శంకర్‌గౌడ్, నరహరి, సత్యనారాయణ, మురళీ, మల్లేశ్, సత్యనారాయణ, శివాగౌడ్, రమేశ్, తిరుపతి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.




క్లుప్తంగా

దాడి కేసుల్లో ఎనిమిది మంది అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ బన్సీలాల్

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని హ మాలీవాడ, సప్తగిరికాలనీ, అశోక్ రోడ్‌లో దాడులకు దిగిన ఎనిమిది మంది వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పట్టణ సీఐ బన్సీలాల్ తెలిపారు. శుక్రవారం రాత్రి స్థానిక పోలీసుస్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. చర్చి సమీపంలో మహిళలు బతుకమ్మ ఆడుతుండగా శ్రావణ్, వంశీలపై మద్యంమత్తులో శరత్, సురేష్, అనిరుధ్, అఖిల్ మరికొందరు దాడి చేశారని తెలిపారు. సప్తగిరికాలనీలో ప్రేమ వ్యవహారానికి సంబంధించి తోట తిరుపతిపై అగ్గి మారుతితోపాటు మరి కొందరు దాడి చేశారని పేర్కొన్నారు. అశోక్‌రోడ్‌లో అప్పు వ్యవహారానికి సంబంధించి కోపం పెంచుకుని సోహెల్‌పై రాజు, శ్రావణ్, చిలుక సాయి మరి కొంద రు మద్యంమత్తులో దాడి చేసి అతడి కారు అద్దం ధ్వంసం చేశారని తెలిపారు. ఈ మూడు కేసుల్లో బాధితుల ఫిర్యా దు మేరకు శరత్, సురేష్, అనిరుధ్, అఖిల్, మారుతి, రాజు, శ్రావణ్, సాయిలను అరెస్ట్ చేసినట్లు తెలిపా రు. పండుగ పూట మద్యంమత్తులో, పాత కక్షలను దృష్టిలో ఉంచుకుని దాడులకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు. ఈ సమవేశంలో ఎస్సైలు సనత్‌రెడ్డి, సురేష్ పాల్గొన్నారు.



రూ.10.. పరేషాన్..!

- మార్కెట్లో తగ్గిన కరెన్సీ నోట్ల చెలామణి
- ఇబ్బందుల్లో వ్యాపారులు, ప్రజలు



రూ.10 నోటు

నెన్నెల: మార్కెట్లో రూ.10 నోటు కనిపించడం గగనంగా మారింది. దీంతో అటు వ్యాపారులు.. ఇటు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. సాధారణ కొనుగోళ్లకు 1, 2, 5, 10 రూపాయల నాణేలు గతంలో చాలా చెలామణిలో ఉండేవి. ధరల పెరుగుదల కారణంగా 1, 2, 5రూపాయల నాణేలు ఉన్నా 5, 10రూపాయల నాణేల వినియోగం పెరిగింది. ప్రస్తుతం ఆయా నాణేలతోపాటు రూ.10 నోట్ల చెలామణి కూడా భారీగా తగ్గింది. వ్యాపారులు ఏదైనా వస్తువు విలువ చెప్పేటప్పుడు రూ.5కు రెండు, రూ.10కి మూడు అని చెబుతున్నారు. దీంతో కి రాణ, ఫ్యాన్సీ, కూరగాయలు, బస్సు, ఆటో చార్జీల్లో రూ.10 కరెన్సీ నోటుకు ప్రాధాన్యం పెరిగింది. ప్రస్తుతం రూ.10 నోటు మార్కెట్‌లో అందుబాటులో లేక వ్యాపారులు ఇక్కట్లకు గురవుతున్నారు.

ఆన్‌లైన్ చెల్లింపులు

కరోనా తర్వాత డిజిటల్ చెల్లింపులు పెరిగాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహిస్తున్నాయి. దీంతో అన్ని వర్గాల ప్రజలు ఆన్‌లైన్ చెల్లింపులకు అలవాటుపడ్డారు. ఏ దుకాణానికి వెళ్లినా, ఏ వస్తువు కొనుగోలు చేయాలన్నా డిజిటల్ చెల్లింపులు అనే పరిస్థితి నెలకొంది. వీధి వ్యాపారులు, చిన్న దుకాణాల్లో, చిన్నపాటి చెల్లింపులకు ఫోన్‌పే, గూగుల్‌పే వంటివి ప్రత్యేకంగా వ్యాలెట్ రూపంలో సులభతర చెల్లింపులకు అనుమతిస్తున్నారు. దీంతో రూ.5, రూ.10 లావాదేవీలకు కూడా వినియోగదారులు నోట్లు ఇవ్వడం లేదు. క్రమంగా రూ.10 నోటు బదలాయింపు జరగకపోవడం వల్ల వ్యాపారులు, వినియోగదారుల వద్ద అందుబాటులో లేకుండా పోయింది. మార్కెట్‌లో ప్రస్తుతం చిరిగిన రూ.10 నోట్లు దర్శనమిస్తుండడం గమనార్హం.

ఎక్కడ ఆగిందో..?

రూ.10 నోటు మార్కెట్‌లో చెలామణి తగ్గడంలో అసలు సమస్య ఎక్కడ ఉత్పన్నమైందో అర్థం కాని పరిస్థితి ఏర్పడింది. వ్యాపారులు సైతం ఈ పరిస్థితిపై ఓ అంచనాకు రాలేకపోతున్నారు. వినియోగదారులు చిరు వ్యాపారుల వద్ద వస్తువులు కొనుగోలు చేసినప్పుడు రూ.100 నోటు ఇస్తే వ్యాపారులు తిరిగి ఇవ్వాల్సిన చిల్లరకు అవస్థలు పడుతున్నారు. గతంలో రూ.1, రూ.2 చెల్లింపులకు బదులుగా చాక్లెట్లు, బిస్కెట్లు వంటివి ఇచ్చేవారు. కానీ రూ.10లకు ఏమి ఇవ్వాలని వ్యాపారులు ఆలోచనలో పడ్డారు. ఇస్తే వినియోగదారుడు ఎలా స్పందిస్తారనే ఆందోళన వారిలో నెలకొంది. భారీ మొత్తాల చెల్లింపుల విషయంలో పరిస్థితి భిన్నంగా ఉంది. పెద్ద మొత్తంలో లావాదేవీలకు డిజిటల్ చెల్లింపులు జరిగితే వినియోగదారులు, వ్యాపారులు పన్నుల పరిధిలోకి వస్తామని ఆందోళన చెందుతుండడమే ఈ పరిస్థితికి కారణం. చిన్నమొత్తాల చెల్లింపుల కారణంగా కొన్నిసార్లు యూపీఐ సర్వర్‌లపై భారం పడి పని చేయని పరిస్థితి నెలకొంటోందని వ్యాపారులు చెబుతున్నారు.

నోట్ల కొరత వాస్తవమే

రూ.10 నోట్ల కొరత ఉన్న మాట వాస్తవమే. రిజర్వు బ్యాంకు నుంచి రావడం లేదు. రూ.20, రూ.50, రూ.100 నోట్లు మాత్రమే వస్తున్నాయి. రూ.10 నోట్లు రావడం లేదు. నాణేలు మాత్రం అందుబాటులో ఉన్నాయి. అవి చెల్లుబాటులో ఉన్నాయని ప్రజలు గమనించాలి.

– గోపికృష్ణ, తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్, ఆవుదం

సవాళ్లను ఎదుర్కోవాలి



జీఎం కార్యాలయంలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరిస్తున్న జీఎం సంజీవరెడ్డి

శ్రీరాంపూర్: రాబోయే కాలంలో సంస్థ సవాళ్లను ఎదుర్కోవాల్సి ఉందని శ్రీరాంపూర్ జీఎం బీ.సంజీవరెడ్డి అన్నారు. శుక్రవారం జీఎం కార్యాలయం, ఆర్కే 6 గని, ఆర్కే 7గని, ఎస్సార్పీ 3 గనులపై 'ఉజ్వల సింగరేణి–ఉద్యోగుల పాత్ర' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ సింగరేణి మార్కెట్ పోటీని తట్టుకుని నిలబడాలంటే ఉత్పత్తి ఖర్చు తగ్గించుకోవాలని అన్నారు. భూగర్భ గనుల్లో బొగ్గు ఉత్పత్తి ఖర్చు అమ్మకం కంటే రెండింతలు ఉంటుందని తెలిపారు. ఇతర కంపెనీల బొగ్గు తక్కువ ధరకు మార్కెట్‌లో లభ్యం అవుతోందని అన్నారు. ఉత్పత్తి ఖర్చు తగ్గించుకోవడం కోసం యంత్రాల పనిగంటలు పెంచాలని తెలిపారు. మానవ వనరులను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. సంస్థ ఉత్పత్తి లక్ష్యాలు, ఆర్థిక స్థితిగతులను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం కార్మికులకు విందు భోజనాలు ఏర్పాటు చేశారు. ఆయా గనులపై వేర్వేరుగా జరిగిన కార్యక్రమాల్లో గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచి సెక్రెటరి ఎస్కే బాజీసైదా, అధికారుల సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, ఏజీఎం(ఫైనాన్స్) మురళీధర్, ఏజెంట్ గోపాల్‌సింగ్, శ్రీధర్, డీజీఎంలు చంద్రలింగం, గనుల మేనేజర్లు ఈ.తిరుపతి, సీహెచ్.వెంకటేశ్వర్లు, ఇంచార్జీ డీజీఎం రాజేశ్వర్‌రావు పాల్గొన్నారు.

కొత్త పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి

జైపూర్: సింగరేణి అధికారులు, ఉద్యోగులు కొత్త పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ సంస్థకు మరింత లాభాలు వచ్చే విధంగా కృషి చేయాలని చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి అన్నారు. శుక్రవారం జైపూర్‌లోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్, ఇందారం, ఓసీపీ అధికారులతో కలిసి సందర్శించారు. 'ఉజ్వల సింగరేణి–ఉద్యోగుల పాత్ర' కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఐకే–1ఏ గనిపై నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీ వంశీకృష్ణ, చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి పాల్గొన్నారు. డీ.రాజశేఖర్‌రావు, ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, జీఎంలు శ్రీనివాసులు, సంజీవరెడ్డి, ఓఅండ్ఎం జైసింగ్ పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

మందమర్రిరూరల్: మందమర్రి పోలీస్‌స్టేషన్ పరిధిలోని చెత్లాపూర్ సమీపంలో పేకాట స్థావరంపై ఎస్సై రాజశేఖర్ శుక్రవారం తన సిబ్బందితో దాడి చేశారు. సీరటి శ్రీశైలం, పు లి బానయ్య, కప్ప నర్సయ్య, బబ్బెర విజ య్, రత్నం వెంకటస్వామిలను అరెస్టు చేశా రు. రూ.15,720 నగదు, ఐదు సెల్‌ఫోన్లు, ఐ దు మోటార్ సైకిళ్లు స్వాధీనం చేసుకున్నారు.

కొండచిలువ హతం



కుంటాల: మండలంలోని ఓలా శివారులో వ్యవసాయ పనులు చేస్తుండగా కనిపించిన కొండ చిలువను రైతులు శుక్రవారం హతమార్చారు. కుంటాలకు చెందిన గొల్ల నవీన్, ఒడ్నం రమేశ్ సోయా పంట నూర్పిడి చేసే క్రమంలో పిచ్చిమొక్కలు తొలగిస్తున్నారు. వారికి కొండచిలువ కనిపించింది. వెంటనే దాన్ని హతమార్చారు. కొండచిలువ సుమారు 7 ఫీట్ల ఎత్తు, 15 కిలోల బరువు ఉందని రైతులు తెలిపారు.





























